క్లుప్తంగా

ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం

ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్



ఫోన్‌లో సమస్యలు వింటున్న డిపో మేనేజర్ మనోహర్

కాకినాడ: ఆర్టీసీ ప్రయాణికుల సూచనలు స్వీకరించి, తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. కాకినాడ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పలు సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకొచ్చారు. పండూరు జంక్షన్‌లోని కేంద్రీయ విద్యాలయం వద్ద బస్సును నిలుపుదల చేయాలని ప్రయాణికుడు రామకృష్ణ కోరారు. అలాగే కాకినాడ నుంచి రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు బస్సును నడపాలని మోహన్ అనే ప్రయాణికుడు విజ్ఞప్తి చేశారు. కాకినాడ జమునా నగర్ కాలనీ వద్ద బస్సును నిలుపుదల చేయడం లేదని సుబ్బారావు అనే మరో ప్రయాణికుడు డీఎం దృష్టికి తీసుకొచ్చారు. ఆయా ప్రతిపాదనలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి, పరిష్కరిస్తామని డిపో మేనేజర్ మనోహర్ హామీ ఇచ్చారు.

తహసీల్దార్‌కు వీఆర్‌ఏల అభినందనలు

కరప: మండల వీఆర్‌ఏల సంఘ నాయకులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నందిపాటి సత్యనారాయణను కలిసి అభినందనలు తెలిపారు. తహసీల్దార్ సత్యనారాయణ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆయనను మర్యాదపూర్వకంగా కలిసినట్టు వీఆర్‌ఏలు తెలిపారు. సంఘ అధ్యక్షుడు షేక్ సాహెబ్ సుహానీ, ఉపాధ్యక్షుడు దేవానందం, సెక్రటరీ టి.గణేష్, కోశాధికారి ఎస్.సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పేదల కోసం అంబులెన్స్ సేవలు

ప్రారంభించిన కమిషనర్ భావన



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: పేద ప్రజలకు అండగా కాకినాడ ఖిద్మత్ కమిటీ అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన కొనియాడారు. కాకినాడ ఖిద్మత్ కమిటీ ఆధ్వర్యంలో పునః ప్రారంభించిన అంబులెన్స్ సేవలను గురువారం ఆమె ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో పేదలకు అండగా ఖిద్మత్ కమిటీ విస్తృత సేవలు అందించిందన్నారు. ఆపదలో ఉన్న ఎంతో మందికి సేవలందిస్తున్న ఖిద్మత్ కమిటీ ఇతర సేవా సంస్థలకు ఆదర్శమన్నారు. ఖిద్మత్ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ, అంబులెన్స్ అవసరమైతే 98492 23178 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు చిష్టి, సభ్యులు అలీమ్, హసన్ షరీఫ్, రాజు, మస్తాన్, షారూక్, బాషా, తాజుద్దీన్, కరీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీసింగ్ సెంటర్‌లో ప్రమాదం

ఒడిశా వాసి మృతి

కాకినాడ రూరల్: వలసపాకల జంక్షన్ వద్ద సూర్య కార్ వాష్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన తొడంగి జాకబ్(20) మృతి చెందాడు. సర్పవరం పోలీసుల వివరాల మేరకు, వాటర్ సర్వీసింగ్ సెంటరులో ఒడిశాలోని కొరపుట్ సిటీకి చెందిన ఐదుగురు పనిచేస్తున్నారు. వాటర్ సర్వీసింగ్‌కు వచ్చిన కారు కింద జాకబ్ ఉండి, వాహనాన్ని సర్వీసింగ్ దిమ్మపై పెట్టాలని సూచించాడు. మరో కార్మికుడు కారుని కొద్దిగా ముందుకు పోనిచ్చాడు. ఈ క్రమంలో జాకబ్ ఛాతిని రాసుకుంటూ కారు వెళ్లడంతో, అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆతడిని జీజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్సై నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:	విశ్వం, వేట్టయాన్, దేవర, జనక
దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్:	దేవర, వేట్టయాన్, మా నాన్న సూపర్ హీరో
లక్ష్మి:	దేవర
సత్యగౌరి:	మా నాన్న సూపర్ హీరో
తిరుమల:	వేట్టయాన్
సీఅండ్‌సీ1:	మత్తు వదలరా
సీఅండ్‌సీ2:	శ్వాగ్
శ్రీప్రియ:	మార్టిన్
పద్మప్రియ:	దేవర
సూర్య (వాకలపూడి):	దేవర
సూర్య2:	విశ్వం

అంబరాన్నంటే సంబరం

మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ.. సర్వాంగ సుందరంగా అలంకరించిన ఏనుగు, హంస వాహనాలు.. బ్యాండు మేళాలు.. అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు.. బుట్టబొమ్మలు, లక్క గుర్రాలతో విన్యాసాలు.. ఇవీ కరపలో జరిగే విజయ దశమి సంబరాల కమనీయ దృశ్యాలు. లక్షలాది రూపాయల వ్యయంతో కన్నుల పండువగా సాగే ఈ సంబరం జిల్లావ్యాప్తంగా ప్రసిద్ధిగాంచింది. వేడుకలను తిలకించేందుకు దూర ప్రాంతాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తారు. శనివారం జరగనున్న కరప దసరా ఉత్సవంపై ప్రత్యేక కథనం.

- కమనీయం కరప దసరా వేడుకలు
- రేపు ఏనుగుల సంబరం
- సుదూర ప్రాంతాల నుంచి తరలిరానున్న ప్రేక్షకులు
- ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో సన్నాహాలు




విద్యుద్దీపాలంకరణతో ముస్తాబైన ఏనుగు వాహనాలు(ఫైల్)



హంస వాహనం(ఫైల్)



ట్రాక్టర్‌పై దుర్గాదేవి అవతారంలో వేషధారణ (ఫైల్)

కరప: సుమారు ఆరున్నర దశాబ్దాల క్రితం కరపకు చెందిన దొరలు అప్పటి కలకత్తాలోని కాళికామాత ఉత్సవాల్లో నిజమైన ఏనుగులను అలంకరించి ఊరేగించడాన్ని తిలకించారు. అదేవిధంగా ఏనుగు బొమ్మతో ఇక్కడి సంబరానికి వారు అంకురార్పణ చేశారని పెద్దలు చెబుతుంటారు. తొలుత గ్రామంలోని పల్లపువీధిలో వెదురు బద్దలు, అట్ట ముక్కలు తదితర వాటితో చిన్నపాటి ఏనుగు బొమ్మను తయారు చేసి ఉత్సవాన్ని నిర్వహించేవారు. తదనంతరం కాలంలో గ్రామంలోని మెరకవీధి, కొత్తపేట, బీసీవీధి, సీతమ్మవీధి, వీధుల వారు భారీ పరిమాణంలో ఏనుగు, హంస బొమ్మలను తయారు చేసి, సంబరం చేయడం ప్రారంభించారు. తర్వాత నీలయ్యతోట, ఎస్సీ కాలనీ, రామకంచిరాజు నగర్ కాలనీవాసులు కూడా సంబరం చేయనారంభించారు. ఏనుగు, హంస వాహనాలకు ఎదురుగా బ్యాండ్ మేళాలు, లక్క గుర్రాలు, తప్పెటగుళ్లు, కోలాటం, కోయ డ్యాన్సులు, ఎలుగుబంట్ల నృత్యాలు, కరాటే, ట్రాక్టర్లపై వేషధారణలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలతో తెల్లవార్లూ గ్రామంలో సంబరం జరుపుతారు. కరపలో జరిగే ఏనుగుల సంబరం(దసరా ఉత్సవం)ను తిలకించేందుకు కరప, పరిసర మండలాల నుంచే కాకుండా, జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివస్తారు.

గ్రామం సుభిక్షంగా ఉండాలని..

సంబరం గ్రామంలోని వీధుల్లో ఊరేగిన అనంతరం తెల్లవారుజాము సమయంలో.. సంబరం మొత్తం గ్రామ ప్రధాన రహదారిపైకి చేరుకుంటుంది. గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రధాన రహదారిపై ఏనుగు, హంస వాహనాలను ఎదురెదురుగా ఉంచి జమ్మిపత్రితో శమీపూజ నిర్వహిస్తారు. అక్కడి నుంచి ఒకదాని వెంబడి మరో వాహనం ముందుకు సాగుతుంటే, చూసేవారికి బోరా అనిపించక మానదు. రైతుల ధాన్యం విక్రయాలపై వచ్చిన కొలగారం, చందాలతో ఆయా వీధుల వారు సంబరాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది సంబరాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆయా వీధుల్లోని దసరా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశారు.

దుర్గాదేవి ఊరేగింపు

గ్రామంలో హైస్కూల్ సెంటర్‌లో ఉన్న దుర్గాదేవి ఆలయం శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమైన రోజు నుంచి నిత్యం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, కుంకుమార్చనలు చేస్తారు. విజయ దశమి రోజున అమ్మవారిని పల్లకీలో ఉంచి, బ్యాండు మేళం, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం జరుపుతారు. ఇలా చేయడం వల్ల పాడిపంటలు వృద్ధి చెంది, గ్రామం సుభిక్షంగా ఉంటుందని గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం.

విశ్వకర్మ యోజనపై కమిషనర్ సమీక్ష



పథకంపై సమీక్షిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: సంప్రదాయ చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ప్రగతిపై నగరపాలక సంస్థ కమిషనర్ భావన సమీక్షించారు. గురువారం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశమై పథకం కోసం వచ్చిన దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. వివిధ చేతివృత్తిదారుల నుంచి సుమారు 2,748 దరఖాస్తులు వచ్చాయని సంబంధిత అధికారులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వార్డు వెల్ఫేర్ సెక్రటరీల ద్వారా దరఖాస్తులను పరిశీలించాలని కమిషనర్ సూచించారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులను గుర్తించి వృత్తి నైపుణ్య కళాకారులు, సంప్రదాయ కుటుంబ వృత్తిని, వృత్తిలో ఉన్నవారిని గుర్తించి, పథకం ద్వారా లబ్ధి పొందేలా చూడాలని చెప్పారు. సమావేశంలో టీపీఆర్వో శైలజ, మెప్మా మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు గురువారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చగా,, నలుగురికి రెండు రోజుల వంతున జైలు, ఏడుగురికి రూ.10 వేల వంతున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

జగన్మాతా నమోస్తుతే..



కరప శివాలయంలో శుంభ, నిశుంభల వధ అవతారంలో పర్వతవర్ధినీదేవి



ప్రత్యేకాలంకరణలో కరపలోని దుర్గాదేవి అమ్మవారు



చాముండీదేవి అలంకరణలో దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



దుర్గాదేవి అలంకరణలో అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో అమ్మవారు



భానులింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు

అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు గురువారం అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారు శుంభ, నిశుంభల వధ అలంకరణలో భక్తులకు కనువిందు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సకలసిద్ధి నాట్యాలయం కళాకారుల నృత్య ప్రదర్శన, అనంతరం నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్స్ కళాకారుల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం విఘ్నేశ్వర నృత్య నికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు చాముండీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తుల కోసం ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో ఉదయం కుంకుమ పూజలు నిర్వహించారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్ప స్వామి ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని మంటపంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గులాబీలతో ప్రత్యేకంగా పూజించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి పూజలు

కరప: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో వివిధ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో దుర్గాష్టమి ప్రత్యేక పూజలను భక్తి,శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కరప, జెడ్.భావారం, అరట్లకట్ట, వలసపాకల, కొరుపల్లి, గొడ్డటిపాలెం, నడకుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి, వేళంగి, పెద్దాపురప్పాడు, పెనుగుదురు, వేములవాడ, కూరాడ, వాకాడ, యండమూరు తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కరప శివాలయంలోని పర్వత వర్ధినీదేవిని శుంభ, నిశుంభల వధ అవతారంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కరప మార్కెట్ యార్డు వద్ద విజయదుర్గా ఆటో యూనియన్ నాయకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవికి పూజాదికాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పెనుగుదురు, నడకుదురు, వలసపాకల, కొరుపల్లి, కరప తదితర గ్రామాల్లో భవానీలు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కొంతమంది ఇరుముడులు ధరించి, మొక్కులు చెల్లించుకోవడానికి విజయవాడ కనకదుర్గ ఆలయానికి వెళ్లారు.

విశ్రాంత శాస్త్రవేత్త యాళ్లకు సన్మానం



విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో గురువారం ప్రపంచ అంతరిక్ష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ మాట్లాడుతూ, ఏటా అక్టోబర్ 4 నుంచి 10 వరకు అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. సోవియట్ యూనియన్ 1957 అక్టోబరు 4న తొలిసారిగా మానవ రహిత ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపిందని, ఆ తర్వాత పదేళ్లకు 1967 అక్టోబరు 10న మరో ఉప గ్రహం పంపిందన్నారు. అప్పటి నుంచి అంతరిక్ష వారోత్సవాలు జరుపుతున్నట్టు వివరించారు. అంతరిక్షాన్ని శాంతి ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని, దానిని దుర్వినియోగం చేయరాదని ఐక్యరాజ్య సమితి తీర్మానించిందని చెప్పారు. ఆ దిశగా సభ్య దేశాల మధ్య ఒడంబడిక కుందరిందని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ జీఎం ఇందుగుల ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ, భారత అంతరిక్ష పితామహుడు డాక్టరు విక్రమ్ అంబాలాల్ సారాబాయ్ నేతృత్వంలో 1963లో అంతరిక్ష ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, సంగిశెట్టి వెంకటరమణ, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం శ్రీపీఠం



శ్రీపీఠంలో మహాశక్తి యాగం కుంకుమ పూజలకు తరలివస్తున్న భక్తులు

కాకినాడ రూరల్: మహాశక్తి యాగం నిర్వహిస్తున్న స్థానిక రమణయ్యపేటలోని శ్రీపీఠం భక్త జన సంద్రంగా మారింది. మహాశక్తి యాగం లలితా సహస్ర నామార్చన కుంకుమ పూజలో పాల్గొనేందుకు గురువారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. జిల్లా నలుమూలలు నుంచి, ఇతర ప్రాంతాల నుంచి మహిళలు తరలిరావడంతో రమణయ్యపేట శ్రీపీఠం ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఒకేరోజు 70 వేల మంది భక్తుల రాకతో ప్రాంగణమంతా కిక్కిరిసింది. పూజ అనంతరం తిరిగి వెళ్లేటప్పుడు సుమారు గంటసేపు రద్దీ కొనసాగింది. పరిపూర్ణానంద స్వామి పిలుపుతో కుంకుమ పూజలకు తరలివచ్చిన మహిళలు ఎర్రటి దీక్షా వస్త్రాలు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడు సార్లు లలితా నామాలతో కుంకుమ పూజలు చేయించగాచ, స్వామి రెండు సార్లు, డీఎస్పీ రఘువీర్ విష్ణు ఒక్కసారి మంత్రోచ్ఛరణ చేశారు.

'లయన్స్' సభ్యుల నేత్రదాన ప్రతిజ్ఞ

బాలాజీచెరువు: ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా కాకినాడ ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ ఆవరణలో కాకినాడ లయన్స్ క్లబ్ సభ్యులు నేత్రదాన ప్రతిజ్ఞ చేశారు. వాటిని డాక్టర్ బాదం బాలకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, కొన్ని వేల మంది కార్నియల్ అంధులు కంటిచూపు లేక చీకటిలోనే మగ్గుతున్నారన్నారు. వారికి కంటి వెలుగు ప్రసాదించాలంటే మరణానంతరం ప్రతిఒక్కరూ నేత్రదానం చేయాలన్నారు. ఇప్పటివరకు ఐ బ్యాంక్ ద్వారా 7,146 కార్నియాలు సేకరించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ బ్యాంక్ ట్రస్టీ జీవీఎస్ గాంధీజీ, క్లబ్ సభ్యులు ఎంవీఆర్ మోహన్‌కుమార్, పీవీ సుబ్బారావు, పద్మతులసి, పీవీఎస్ఎస్ కుమార్, జీఎల్ జగన్నాథరావు, ఎ.సూర్యనారాయణ, ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణ, ఎస్.నాగలక్ష్మి, ఎం.వెంకట్, పి.అనుపమ, బి.కృష్ణారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనసాగించాలి

జేసీకి మొరపెట్టుకున్న పీపీసీ సిబ్బంది



జేసీకి తమ గోడు వినిపిస్తున్న పీపీసీ సిబ్బంది

కాకినాడ సిటీ: ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 2023-24లో పనిచేసిన టీఏ, డీఈవో, హెల్పర్లను కొనసాగించాలని కోరుతూ గురువారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. జిల్లా పౌర సరఫరాల సంస్థలో డీఎస్సీ ద్వారా 214 ఆర్బీకేల్లో ప్రత్యేక సిబ్బందిని జేసీ సమక్షంలో ఎంపిక చేశారన్నారు. ఒక్కొక్క ఆర్బీకేలో ఒకొక్క టీఏ, డీఈవో, హెల్పర్‌ను మెరిట్ ద్వారా రోస్టర్ పద్ధతిలో నియమించారన్నారు. ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు ఏ రకంగా చేయాలనే దానిపై శిక్షణ కూడా ఇచ్చారన్నారు. అనంతరం జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చి ఉద్యోగాల్లో చేర్చుకున్నట్లు తెలిపారు. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లలో తాము పని చేశామన్నారు. ఇప్పుడు తమ పేర్లను తొలగించి రాజకీయ నాయకులు చెప్పిన వ్యక్తులను నియమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయారు. ఎటువంటి విద్యార్హతలు లేని వ్యక్తులు, బంధువులు, స్నేహితుల పేర్లతో రాజకీయ నేతలు కొత్త లిస్టును జిల్లా పౌర సరఫరాల అధికారులకు పంపినట్లు తెలిసిందన్నారు. ఈ విషయమై జిల్లా పౌర సరఫరాల అధికారిని సంప్రదించగా, ఆయన సూచనతో డీసీవోను కలిశామన్నారు. రాజకీయ పరంగా వచ్చిన లిస్టులోని వ్యక్తులను తీసుకున్నట్లు ఆయన తెలిపారన్నారు. ఎటువంటి సమాచారం లేకుండా ఆర్బీకేల్లో పని చేసిన 642 మందిని తొలగించి, కొత్త వారిని వేసుకున్నామని చెప్పడం సరికాదన్నారు. అన్ని అర్హతలున్న తమను ఈ ఏడాది ఆయా కేంద్రాల్లో పని చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండగ



బోనాలతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్ అచ్యుతాపురంలోని కనక దుర్గ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకుని ఎస్ అచ్యుతాపురంలోని పలు వీధుల్లో శోభాయాత్ర జరిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గౌతు చిన్న, ఉలింగల గంగాధర్, ప్రసాద్, సత్తిబాబు, వెంకన్న పాల్గొన్నారు.